# భయం

"ఓలమ్మ! పాఁవ(రా!" అంటూ ఒక్కదాటు వేసి వాకిట్లోకి వచ్చి పడింది పారమ్మ.

పూరింటి గుమ్మంలో, ఆమె ఎత్తేసిన బుడ్డి దీపం 'భగ్' 'భగ్' మని మండుతోంది.

"ఎక్కడే?.... ఓ లెక్కడే?" అంటూ మద్దింట్లోంచి అత్తా, "ఆఁ!..... ఏటయ్యింది? యేటయ్యింది?" అంటూ ముసలయ్యా, రెండిళ్ళ వాకిట్లోకి వచ్చేరు.

పారమ్మ – పాతికేళ్ళ మనిషి. వడలిపోయిన పచ్చి మామిడికాయలా వుండేది. వజ వజ వజవజా వొణుకుతూ, పూరింటి చీడీలో పొయ్యి మూల కట్టెల్లోకి చూపించిందామె.

చూపించిందే గాని, వెంటనే చెయ్యి వెనక్కి తీసేసుకుంది.

ముసలాళ్ళకి కూడా కాళ్ళల్లోంచి దడొచ్చింది. వాళ్ళకు పగలే చూపు సరీగ్గా ఆనదు. అసలే సంజవేళ. దానికి తోడు, పొరుగు పెరటి చింతచెట్టు జీబూతంలా పెరిగి వుంది. ఆ అరచీకట్లో – పూరింటి ముంజూరు, ముంజూరు కింద పెల్లలు విరిగిపడ్డ పిట్టగోడ: పిట్టగోడ పక్కనున్నది క(ర్రల పొయ్యి, దాని వెనక కరుదూపం పెచ్చులు కట్టిన పాతగోడ; అవతల మూలని, పొయ్యికోసం తురిమిన కమ్మరేకులూ, తాటి గొడితెలూ – ఇదీ అక్కడి వాతావరణం.

"ఎక్కడే??"అంది ముసలమ్మ.

"అది గాదా??..... కమ్మరేకుల్లోకి తలా, బైటికి తోకా!.... గోడ వోరనుంది." – కోపగించుకున్నట్టు చెప్పింది కోడలు.

కనిపించని (పమాదమేదో కాళ్ళని అల్లుకొంటున్నటే భయపడుతోంది. ముసలాళ్ళిద్దరూ అడుగు కదపలేదు; నిల్చున్న చోటునించి వాళ్ళకి ఏఁవీ కనిపించదు.

అంతలో – సత్తిగాడూ. ఆ వెంటే గౌరేసూ పరిగెత్తుకొచ్చేరు.

"ఎక్కడ!.... .... ఎక్కడ??" అనే తం(డికి, "అదిగో!..... అద్గోరయ్యా!! ....ఆ మూలకి...." అంటూ ముందుకు వెళ్ళి వంగి చూపిస్తున్నాడు సత్తిగాడు.

'భగ్' 'భగ్' మనే బుడ్డి దీపం. మొత్తం కిరసనాయిలంతా అంటగా, 'భగ భగ' 'భగ భగ' మంటూ కాలుతోంది.

రేకుల్లోండి బయటపడ్డ పాము, అటూ ఇటూ చూసి, గోడకేసి మెడ చాపుతోంది.

ఇప్పుడు పాముని స్పష్టంగా చూసింది పారమ్మ. ముందు ముందుకి వంగి చూస్తున్న కొడుకు రెక్క అందుకొని, ఒక్క గుంజు గుంజింది. సత్తిగాడు తేరుకొనే లోగానే, వాడి వీపుమీద ఒక్క చరుపు చరిచిందామె.

"పారిపోతంది! క(ర – క(రొట్టుకురా!" అరిచేడు గౌరీసు.

క(రమాట వినగానే, దెబ్బ దులిపేసేడు సత్తిగాడు. వాడు ఇంట్లోకి వెళ్ళొచ్చే లోగా తక్కిన ముగ్గురూ 'గొల్లు' మన్నారు. గౌరేసు కసురుకుంటే, గందిక (గోల) కొంత తగ్గించేరు.

"పొద్దోయి, పాఁవుని కొట్టకూడదురా!.... ఒహళ మాట సెవినెట్టదు! యేం దారీ...." అంటూ రాగవరస లందుకొంది గౌరేసు తల్లి.

"యేళా పాళా సూడదు – పోని ముందూ యెనకేనా సూడొద్దా?......?" అంటూ ముసిలిదాన్ని మందలించేడు ముసిలాడు. పారమ్మ మా(త్రం సత్తిగాడి చెయ్యి వదలలేదు.

నీకు క(ర తిప్పడానికి వాటఁ వెక్కడా?...... ఆనూ పానూ సూడవా?" అంటూ నచ్చ జెబుతోంది పారమ్మ.

ఆ తరవాత – క(ర చేతికొచ్చినా, పాము పారిపోతున్నా కొట్టడఁ వయింది కాదు.

ఇంతలో – వీధిలోంచి జనం, ఆ జనం మధ్యనించి వందలూ వేలూ (పశ్నలూ, (పశల్న వెనక క(రలూ టార్చిలైట్లూ వచ్చేయి.

"పాఁవు నలా వొదల్దానికి వల్లగాదు. నీ యింట్లో పాఁవు, నీయింటే వుండదు కదా! పిల్లుంటాది, పిచికుంటాది. గొడ్డూ గోదా, కోళ్ళుంటాయి. అందుసేత, ఎతికి తీరాల్సిందే!" అన్నారు జనం.

గౌరేసుని ముందు నడవమని పదిమందీ లోపల జొరబడ్డారు. అక్కడ పొడిచి, ఇక్కడ పొడిచి 'ఇల్లల్లా బొక్కలే!' అని, యీసారి దొరికితే ఒగ్గొద్దని అప్పటికి అంతటితో విడిచి పెట్టేరు.

ఆ రా(త్రి ఇంటిల్లిపాదికీ – ఇంటిల్లి పాది సంగతేమో గాని, పారమ్మకి ని(ద్ర పట్టలేదు. కన్ను మూస్తే చాలు – ఆ పాము పరుగులు తీస్తూ, కొడుకు మీదికి వెళ్ళేది. కొడుకు తప్పుకుంటే పెనిమిటి మీదికీ, పెనిమిటి తప్పిస్తే, అత్తమామల మీదికీ ఒకటే పరుగు. కళ్ళు తెరుస్తే – పది పదిహేను కన్నాలున్నాయి– ఏ కన్నంలోకి చూసినా, ఆ పాఁవే కనపడే దామెకి.

ఓసారి మాగన్నులో 'దుభీ'మని ఆమె గుండెలమీదికి దూకింది. ఇంకోసారి ఒత్తిగిలితే పక్క కింద మెత్తగా, చల్లగా తగిలింది. పూర్తిగా తెలివొచ్చి చూస్తే, ఏ పామూ కనిపించదు. ఏ మాయా అగుపించదు.

ఆ మర్నాడు, పారమ్మకీ ఒళ్ళు పట్టని ఉష్ణం. ఒకటే పలవరింతలు. మధ్య మధ్య కేకలు. మం(త్రించిన విబూది పెట్టేకా, అత్త మొక్కవలసిన మొక్కులు మొక్కేకా – కొంత కుదుట పడింది.

నాలుగు లంఖణాలు చేసి, మనిషి తిరుగాడు తోందంటే,

మళ్ళా పాము కనిపించింది. ఈసారి పిడకల కుచ్చిలి కిందకి దూరుతుంటే, అత్త స్వయంగా చూసింది.

“దాన్ని సంపప్పోతే, యెప్పుడో అదే మన్ని సంపేస్తది” అన్నాడు గౌరేసు.

“హన్నా! నిజంవేౘ్రయ్యా! ఒల్లమాలిన అడ్డైతే, ఓసరిల్ల కేం జేస్తావూ?–” అంటూ సాగదీసింది తల్లి.

భార్య గర్భిణి. ఆ అడ్డు గౌరేసు కూడా దాటలేదు. అయినా, వున్న ఒక్క కొడుకూ దుందుడుకు వాడు. ఇక తల్లికీ తండ్రికీ చూపు సరిలేదు.

మంత్రించిన బూడిద జల్లిస్తానని తండ్రి ఎంత చెప్పినా, గౌరేసు వినిపించు కోలేదు.చేపాటి కఱ్ఱ తీసుకొని, పిడకల కుచ్చిలంతా విరగ దీయించేడు.

పాము దొరకలేదు గాని, ఓ పాంవు పొర ముక్కా; రెండు పొదిగి విడిచిన గుడ్లూ దొరికేయి. దాంతో – ఆ యింట జేరింది ఒక్క పాము కాదనీ, అవైనా మామూలు పాంవులు కావనీ తేలిపోయింది.

ఓ రోజు రాత్రి, “ఓలమ్మ! సచ్చిపోయేడఱ్రో!” అంటూ పారమ్మ పెట్టిన గావుకేకతో, వూరూ వాడా రెండిళ్ళ వాకిట్లో చేరేరు.

నీళ్ళ గోలెం దగ్గర కాళ్ళు కడుగుతున్నాడు గౌరేసు. నడిచే కాళ్ళకు కఱ్ఱ అడ్డు పడ్డట్టు అంతెత్తు యెగిరి ‘దభీ’మని పడిపోయేడు. లేచీ లేవని మనిషిని, పాదానికి బెత్తెడుగా కాటందుకొంది. కాలు విదిలిస్తే, కసిగా ఇంకొక్క కాటువేసింది. పారమ్మ పరిగెత్తుకొచ్చే వేళకి పాము పారిపోతోంది.

“ఓలమ్మో! ఓలమ్మో!!” అంటూపారమ్మ గుండెలు బాదుకుంటూ వుంటే, రాం మందిరంలో జనంకూడా పరుగెత్తుకొచ్చేరు.

“నాగుల్సవితికి గుడ్లు మొక్కినానఱ్రా!.....పిల్ల నెల తప్పింది, ఏ బిడ్డ పుట్టినా నీ పేరే యెడతానన్నాను..... యెన్ని మొక్కినా నాగంవయ్య నా గొడుగు నిలిపినాడు కాదు తల్లో! సుబ్బారాయుడు నా పచ్చన్సెట్టు కూల్దోసినా డమ్మా....” అంటూ గౌరేసు తల్లి ఏడుస్తోంది.

అయితే, ఆనాడూ పాము తప్పించుకుంది. ఏ కలుగులో దూరిందో పారమ్మ చూసింది. చెప్పింది కూడా. మరి, ఆ పాంవుని చంపితే మంత్రం పారదంట.

ఎక్కడో – సారాకొట్లో వున్న పాంవుల రాంవులయ్యకి తెలివి తెప్పించి తీసుకొచ్చేసరికి గౌరేసుకి ముచ్చెంవటలూ పోసేసి, నురగలు కక్కడం సరే – కఫం గుండెల కెగదట్టి గురక కూడా పుడుతోంది.

“నాను సెప్పలేను. ఇన్నారా? – నా నామీ యీయ్‌లేను. అయితే, నా ‘డూటీ’ మాత్తరం నాన్తప్పను... ఏటి?.... మంతరగాడన్నాక జీవుడికి కొౕసెంౘ్రుకని జీవుడున్నా, ఆశొగ్గకోడు. అయితే, యెంత మంతరంవైనా దానికీ ఓ టైంౕ వుంటది. ఆ టైంౕవుకి పడితేనే, అది ‘టక్’న పనిసేస్తది. టయాం దాటిపోనాక, ఆ బగమంతుడేసినా మర్నాబం నేదు!.... అందికే బగమంతు డుండాలన్నారు. ఆడు సెక్రం అడ్డేస్తే, మంత్రం యేసినా యెయ్యక పోయినా డోకానేదు. ఆడు తప్ప దల్సినాడో, ఎన్ని మంత్రాలేసినా ఆపవు!. ...జేయ్ సెంకరా! ఆదినారాయనమూర్తీ!” – అంటూ వేపమండ లందుకున్నాడు పాంవుల రాంవులయ్య.

తెల్లవార్లా మంత్రాలు వెయ్యగా వెయ్యగా, తెలతెలవారుతూంటే గురక తగ్గింది. “ఇక పరవాలేదు” అంటూ రాంవులయ్య మంత్రం ఆపేడు.

ఐతే, గౌరేసు బతికేడనే చల్లని కబురు ఊరి కవతల చివర చేరనే లేదు; నెలలు నిండని పురిటికి తట్టుకోలేకా, నాటు మంత్రసాని మోటు సుళువులు వికటించీ పారమ్మ చచ్చిపోయిందనే వార్త దావానలంలా వ్యాపించింది. మధ్యాహ్నం మూడింటికి శవాన్ని వాకిట పడేశారు.

చేట వెనక చేట, రక్తంతో తడిసిన ఇసక ఇంట్లోంచి బైటికి వెళ్తూ ఉంటే, లోపలేం జరుగుతుందో తెలియక సత్తిగాడు బెంబేలుపడీ, గోలు గోలుమన్నాడు. ఎవరో ఒక బిడ్డల్తల్లి వాణ్ని అక్కణ్నించి తన యింటికి తీసుకు పోయి, పారమ్మని పసుపు కుంకాలతో అలంకరించేక, తిరిగి తీసుకువచ్చింది.

ఎంత అలంకరించినా, వికృతంగా కనిపించే తల్లినీ; నెత్తుటికందు, నెలలు నిండని తుట్ట – ఆమె పక్కనే పండబెట్టిన తమ్ముణ్ని చితికెక్కించి కొరివి పెట్టేసరికి సత్తిగాడికి తొమ్మిదేళ్ళ వయసు.

ఆ సత్తిగాడు ఇప్పుడు – సత్తెంవై సత్యంవై; “సత్తెయ్య” అయేడు.

సత్తెయ్యకి, ఈ మధ్యనే బళ్ళో వేసిన కొడుకు కాక, అతని భార్య నేడో రేపో కనబోతోంది.

★ ★ ★

ఏటికి యాభై బారల దూరం ఆ గ్రామం. ఎత్తున వుండే వూరికి, ఏటి నీళ్ళు ఏ కాలంలోనూ ఉపయోగపడవు. వర్షాలు కురిసే రోజుల్లో; వరదలూ నీళ్ళూ వుంటాయి. వర్షాలు ఆగిపోగా నీళ్ళుండవు కాని, వరదల్లో కొట్టుకొచ్చిన పాములు మిగుల్తాయి.

వానాకాలంలో, దాదాపు ప్రతిరోజూ ఎక్కడో ఓ చోట ఒక్క పామైనా కని పిస్తుంది. ఎండలు ముదరగానే, నెరియలు వారిన బీళ్ళ భగభగలకు తట్టుకో లేక, పొద్దు బోయేసరికి పెద్ద మనుషుల్లా తేమగాలి కోసం షికార్లు మొదలెడ తాయి – పాములూ, పాపసంతానాలూను.

ఎప్పుడు, ఏ చోట ఎవరికి పాము కనిపించినా వూరందరూ చెప్పు కుంటారు. రచ్చరాతి మండపం చుట్టూ; రామ్మందిరం అరుగుల మీదా; ఇళ్ళలోనూ, వాకిళ్లలోనూ – జనం గుంపులు గుంపులుగా, జట్లు జట్లుగా వినిపించినవీ, విన్నవీ – విని – వినిపించినవీ – ఎన్నో కథలు! వాటికి లెక్కలేదు.

"నా కంట నరుడు పడకూడదు: నరుడికంట నాను పడకూడదు" అంటూ పుట్ట వదలి బయటికి వస్తుందట నాగుపాఁవు.

నాగుపాము కళ్ళల్లో , కెమేరా అరవంటి ఏర్పాటుంటుందిట. ఒకసారి దానికి హానిచేసిన మనిషి ఏడేడు సముద్రాలవతల, ఎక్కడ దాగున్నా దాని పగనుండి తప్పించుకోలేడు.

మల్లెనాగూ, సంపెంగ నాగూ – ఆ వాసన ఎక్కడుంటే అక్కడ చేరతాయి. అందుకే దేవాలయాల్లో తప్ప, సంపెంగలు పెంచరు. ఆరుబయట పడుకునే టప్పుడు, తెలిసిన ఆడదైతే మల్లెచెండు తలలో వుంచుకోదు.

రక్తపొడ కరిస్తే, అడ్డెడు రక్తం కక్కి, అక్కడికక్కడే చస్తారు. నాగుపాము విషానికైనా విరుగుడుంది గాని, నల్లత్రాచు కరిస్తే మరింక దానికి విరుగుళ్ళేదు. అసలు – మంత్రగాడికి కబురందే దాకా ఆగదు. కుట్టడఁవేఁవిటి, చావడఁవేఁటి – రెండూ ఒక్కసారే.

పొడపాఁవని ఇంకోటుంది. అది సరీగ్గా జానతో జానెడుంటుంది. దాని ఉనికెక్కడో తెలుసా – తాటిచెట్టు మొవ్వ!.... కరవడమెక్కడో తెలుసా? – తాళువుమీద.

– ఈ కథలు దేనికి చెప్తారు? ఎందుకు వింటారు. అంటే లక్ష సమా ధానాలు. హడలు పుట్టించే కథలతోపాటు ఆశ్చర్యం కలిగించేవీ నమ్మశక్యం కానివీ చెప్తారు.

కొన్ని కొన్ని పాఁవుల్ల, కొందరి వంశాలను తరతరాలుగా అంటి పెట్టుకొని కాపాడతాయట. అలాంటి పాఁవులు, పిలిస్తేవచ్చి పళ్ళెంలో పాలు తాగి పోతాయి. ఇంట్లో యీ మూలా, ఆ మూలా నిద్రపోతాయి. చంటి పాపలో, ఆట పాపలో వున్నారంటే – ఆడించడం, ఆడడం కూడా కద్దు. అలాటి జాతైన పాఁవులికి కోపం వస్తే కరవ్వు. పడగ నేలకేసి కొట్టుకొని ప్రాణాలు తీసుకొంటాయి. తెలిసో తెలియకో వాటిని చంపేఁవో, ఆ వంశం అక్కడితో సరి! మరి పుట్టగతులుండవ్!

పావుల్ని గురించిన నమ్మకాలు కూడా తక్కువ కావు. నాగు పాఁవుని చంపినవాడు ఆవునెయ్యి, మంచి గంధం చెక్కలతో దహనం చెయ్యాలి. లేదంటే నాగప్రతిష్ఠ.

పాము, కలలో కనిపిస్తే మంచిది. కల్లో పాము కరిస్తే మంచిది. నిద్రపోయే మనిషికి పాము గొడుగుపడితే, చక్రవర్తి అవుతాడు. కోటికి పడగెత్తడం ఖాయం.

మహాపుణ్యం ఎవరిదీ అంటే – పలవాడే పాముల్ని కళ్ళారా చూసిన వాళ్ళది! ఏ నేలమీద ఆ 'కార్యం' జరిగితే, ఆ నేల బంగారం పండుతుంది. అలాంటప్పుడు పై మీద కండువా పరచాలి. అదృష్టవంతుడివైతే, పాములు దాన్ని తొక్కుతాయి. అలా తొక్కిన గుడ్డ వేసుకొని ఎక్కడికి పోయినా, నీకు జయం తప్పదు –

మనుషుల్లో చాలా రకాలుంటారు. కొందరు, ఎవరైనా ఏదైనా చెపితే నమ్ముతారు. అందులో కొందరు, ఎవరేది చెప్పినా నమ్ముతారు. ఇంకొందరు, ఎవరేఁవి చెప్పినా నమ్మరు. తమ కళ్ళని చూసిందీ, అనుభవించిందీ తప్ప వాళ్ళకి ఇంకేదీ పట్టదు.

సత్తెయ్య, పాఁవుల్ని గురించి చాలా విన్నాడు. శుద్ధ అసంగతాల్నీ, కట్టు కథల్నీ నోరు మూసుకు విన్నాడు. అతడి నమ్మకాలూ, అనుభవాలూ అంతలో మారే రకం కావు.

★ ★ ★

పాముల్ని గురించీ, పాము మంత్రాల్ని గురించీ భ్రమలు సత్తెయ్య నంటక పోడానికి తగిన కారణాలున్నాయి.

దేఁవుడు తల్లి నెత్తుకుపోయినా, దేఁవుడి పేరు పెట్టుకున్నందుకు పాఁవుల రాఁవులయ్య తండ్రిని దక్కించేడు. అందుకతణ్ణి దేఁవుడి కన్నా ఎక్కువగానే చూసుకున్నారు జనఁవూ, జనంతో పాటు సత్తెయ్య కూడా.

అయితే,

గౌరేసుని కరిచింది నాగుపాము కాదట, ఉల్లిపామట!

మంత్రంవేసి వెళ్ళేక పాఁవుల రాఁవులయ్య ఏదో మందు తెచ్చికట్టేడు. మూడు రోజులు కట్టు విప్పలేదు. మూడోనాడు బులబుల్లాడితే, కట్టు విప్పేరు. ఎంతమేర మందు వేసేడో, అంతమేరా అరంగుళం మందాన మాంసం ముద్ద వూడిపడింది.

"ఏఁవిరా, యిది?–" అంటే, అప్పుడు చెప్పేడు, "ఉల్లిపాఁవు కరిసింది: కోరలు విరిగేయ"ని!

ఏభై రూపాయలకు ఒప్పందం చేసుకొని, ఆర్నెల్లు వైద్యం నడిపేడు. ఆ తర్వాత అతణ్ని కాదని మరొహాళ్ళూ, వారూ కాదని యింకొహాళ్ళూ – యిలా చుట్టుపట్ల విష వైద్యులెందరున్నారో అందరూ మారేరు. రోజులూ, నెలలూ, ఋతువులూ, ఏళ్ళూ గడిచినా, "ఆశలు అడుగంటేయ్‌గాని, గాయం కడంట" లేదు.

ఒక వైద్యుడు ఆకుపట్లు కట్టిస్తే, ఇంకొకడు మందులు మింగించేడు. ఒకాయన పసరు వైద్యం చేసి చూస్తే, మరింకో ఆయన ఎక్కడెక్కణ్నించో నానా రకాల వేళ్ళూ తెప్పించి, వాటి నన్నింటినీ గంటల తరబడి నూరించి అలా నూరిన ముద్ద ఆ గోతిలో వేసి కట్టుకట్టమనేవాడు.

ఆ గాయం ఒకప్పుడు మానబారినట్టే కనిపించి మరి నాలుగు రోజుల్లో అరి చేయి మేరనా, అంగుళం లోతునా ఎఱ్ఱటి కండతో చీముశలలు కట్టి, చూడ్డానికే భయంకరంగా వుండేది. భరించరాని దుర్గంధం.

మీద ముసిరే యీగలన్నింటినీ తోలేసి, రావి చెక్క కషాయంతో శుభ్రంగా కడిగి, రక్తం చిమ్మే ఆ కండలమీద వైద్యుడిచ్చిన మందో మాకో పెడితే ఒకప్పుడు – అహాహా! అహాహా!! సల్లగా – బాగుందిరయ్యా?" అనేవాడు గొరేసు. ఇంకో అప్పుడు – "ఓరీ! సంపేసినారో, తొత్తుకొడక!... ఓరి సంపేసి నావురో నాయన!.... " అంటూ, అన్నేళ్ళ వాడూ చిన్న పిల్లలకన్నా అన్యాయంగా బావురుమంటూ, కాలు పట్టుకొని కన్నీరు కార్చేవాడు.

రోజురోజుకీ చిక్కి శల్యమయ్యే తండ్రినీ; యేళ్ళ తరబడి అనుభవించే అతని బాధనీ; ఎన్నేళ్ళకీ నయం చేయలేని విష వైద్యుల్నీ చూస్తూ చూస్తూ – ఎప్పుడో మహామంత్రవేత్త లుండేవారనీ, వాళ్ళు రాయబార మంత్రం వేస్తే కరచిన పాములు, నేరగాళ్ళలా తలలు వంచుకొని వచ్చి, కాటేసిన చోట విషం గ్రహించి, వచ్చిన దారినే, పుచ్చిన కుక్కల్లాగ పోయేవనీ – పెద్దలు చెపితే సత్తెయ్య నమ్మలేకపోయేవాడు.

తన చేతకాని తనాన్నీ; తండ్రిపడే అనంతమైన బాధనీ; ఏ హానీ చెయ్యక పోయినా, ఎందుకో కుట్టిన ఆ పాంవునీ – తలపుల్లో చూసినప్పుడల్లా పామంటే భయం కాని, కనీసం భక్తయినా గాని కలిగేది కాదు సత్తెయ్యకి. ఎంతైనా, అణచరాని అసహ్యమే కలిగేది.

ఇలా వుండగా, అతడి పదిహేనో యేట మొట్టమొదటిసారిగా అతనికి ఒక పాము కనిపించింది.

★ ★ ★

మధ్యాహ్నం ఒంటిగంట అవుతుంది. మంగలి చెంచయ్య పెళ్ళాం, పొదికట్టున తలపెట్టుకొని కోడి కునుకు తీస్తోంది. ఏణ్నర్థం ఆడపిల్ల, ఆమె రొమ్ములతోనూ, పైటతోనూ ఆడుకుంటోంది.

ఎలా తెలిసిందో, ఎందుకు తెలివొచ్చిందో తల్లికి తెలివొచ్చింది. పసిపిల్ల చెయ్యి పైకెత్తి, "ఊఁ.... ఊఁ !..."అంటూ, కోళ్ళ బుట్టకేసి దేకుతోంది.

ఆవేళే పొదిగిన కోడిపిల్లలు అక్కడ బుట్టలో మూసివున్నాయి. ఎలా దూరిందో, ఎన్నింటిని పొట్టబెట్టుకొందో – నిగనిగలాడుతున్న బారెడు పైనున్న పాము ఒకటి, తాజుగా కంతలోంచీ బైటి కొచ్చేస్తోంది.

మంగలమ్మి కెవ్వన కేకేసి, బిడ్డని చంకకెత్తుకుంది. అప్పుడే పరుగెత్తు కొచ్చిన కోడిపెట్ట 'కొక్కు' పెడుతూ, పాముని సమీపించి ఒకటి రెండుకేరులతో పోట్లాటకు దిగింది. గోళ్ళ గాట్లనీ, ముక్కు పోట్లనీ తప్పించుకోడానికి, పాము దగ్గరగా చుట్ట చుట్టుకొంది. కోడి లాఘవంగా ఎగిరినప్పుడల్లా, పాము 'బస్సు' మంటూ పడగ విప్పుతోంది.

పెట్ట పిలుపు విని, ఒకటి రెండు కోళ్లూ, మనిషి మొఱ విని నలుగు రైదుగురు మనుషులూ పరుగెత్తు కొచ్చేరు.

అసలే దోసెడు జాగా. పాము బుసలతోనూ, కోళ్ళ కొక్కరింపులతోనూ రణరంగంలా మారింది. అందులోనే పెద్ద పర్వతంలా కోళ్ళ గంప. ముగ్గురో నలుగురో పిల్లలతో ఆడవాళ్ళు. "హుష్! హోష్!"– అంటూ ముసలి నారయ్య, పైమీది చింకిగుడ్డ సాయంతో పామునీ, కోళ్ళనీ వేరు చెయ్యబోయేడు.

నారయ్య ధర్మమా అని పాముకి కాస్త వెసులుబాటు చిక్కింది. చిక్కిందే తడవు, పారిపోడానికి దారి వెతుకుతోంది.

"ఓలమ్మ, పారిపోతందర్రా" అంటూ ఆతుర పడింది మంగలి చెంచెయ్య పెళ్ళాం.

"పోతే పోనియ్యే! దానికోసం వున్నకోళ్ళను కూడా సంవుకుంటావేటి?'' – పొరుగింటి తోడికోడలు మందలించింది.

ఆ పిల్లకి తోటికోడలి సలహా నచ్చినట్టు లేదు, పాముని పోనియ్య కూడ॑దంటూ వాదిస్తోంది.

పాపిని చంపడఁవా; మానడఁవా అనే మీమాంస మనుషులకేగాని కోళ్ళ కున్నట్లు లేదు. నారయ్య ఎన్నిసార్లు తరిఁవినా, అక్కడక్కడే మనుషుల కాళ్ళ మధ్యనించి దూరిపోతూ ఆ చోటు విడవడం లేదు కోళ్ళు.

ఉన్నట్టుండి ఒక్క కేరుకేరి రెక్కలు టపటప లాడిస్తో కోడిపుంజు ఒకటి గోడమీది కెగిరింది. మరుక్షణం, ఆడవాళ్ళు గోలపెడుతూ బైటి కొచ్చేసేరు. కోడి నేలమీదికి వాలకముందే పాము చుట్టగా పడింది.

అంతవరకూ వాకిట ఒంగొని ఎటూ తేలని సత్యం ఇంక ఆగలేకపోయాడు. ఇంట్లో దూరి, పొదికట్టుకున్న చేపాటి కఱ్ఱతో బైటికొచ్చేడు.

ఆ తరవాత రెండు మూడు నిమిషాలు కోళ్ళూ, మనుషులూ చేసే గోలతో వీధి వీధందరూ నిద్దళ్ళు లేచిపోయేరు. మరో ఐదు నిమిషాలకు తెల్లగా మెరిసే ఎండలో వెల్లకిలా పడివున్న పాము కఱ్ఱమీద వేలాడుతూ బైటికొచ్చింది.

"అమ్మ బాబు! ఎంతుందర్రా!? ... ఏం పాంవు? ఏం పాంవు?" అన్నారు కొందరు.

"అయ్యో! పాపం ఎరమింగిన పాంవర్రా? అలాంటి పాం వుని చంప కూడదు!" అన్నారు భూతదయాపరులు.

ఆ తరవాత సత్యం చంపిన పాంవుల సంగతి చెప్పాలంటే చాలా చెప్పాలి. పదిహేనేళ్ళ సత్యానికి పాతికేళ్ళొచ్చేసరికల్లా 'పాముల సత్తెయ్య' అనే పౌరుషనామం స్థిరపడింది.

★ ★ ★

"..... అంతకో జెబ్బా, యింతకో కాలూ జండా కొయ్యలా వుంటాడే గాని, ఆడి మనసు ఎన్నపూస!" అంటారు ఆడవాళ్ళు సత్తెయ్య గురించి.

"మాటైతే కొంచెం కరుగ్గాని, పనచ్చుకుంటే – ఇది ఎవుళికి నాబం అని ఎనక్కి తిరిగి సూడ్డు. సొంతంగా సేసిన్దానికేనా సొడ్డుంటాది గాని, ఆడుసేస్తే అడ్డే నేదు" అంటారు ఆ వూరి జనం.

తండ్రి వైద్యంతో వున్న చెక్కా ముక్కా అంతా తుడిచిపెట్టుకు పోయింది. పదేళ్ళు అక్కడా యిక్కడా పాలికాపై, యీ మధ్యనే పాతిక సెంట్ల పైరుమడి సంపాదించేడు. కూరగాయలు పెంచుతూ, దొరికిననాడు కూలికి పోతాడు సత్తెయ్య.

పాములంటే భయం లేనివాడు గాబట్టి, పార పని తగిల్నప్పుడల్లా అతణ్నే తప్పక పిలుస్తారు. ఊళ్ళో ఎక్కడ పాము కనిపించినా అతణ్ని పిలుస్తారు. ఆ పని, తిండి పెట్టకపోయినా, దానివల్ల ఓ పలుకుబడి వుంటుంది.

పాము విషయం వస్తే, సత్తెయ్యకి ఓ తిక్క ఉంది. చిన్నా పెద్దా ఎవరు పిల్చినా అతను కాదనడు. అర్థరాత్రి, అపరాత్రి – ఏ వేళైనా అతడు ఖాతరు చెయ్యడు. పాముల్ని పట్టడం కుండల్లో మూసి వూరవతల విడిచి పెట్టడం.... యిలాంటి జీవకారుణ్యమంటేనే అతనికి కిట్టనిది.

"పాంవు మీకు బగమంతుడితో సమానంవా? .... సెప్పండి... దండా లెట్టుకుందాం. పాంవు మాయంవైపోద్ది!... కాదు పాంవుని సంపడం పాపంవంటారా? అప్పుడూ తగువునేదు! మీ పాంవుని మీ యింటి నెట్టుకోండి, నానెల్లిపోతాను. ఇదీ అదీ కాదు – పాంవు కరుస్తాది, అది యిషప్పురుగు – అంటే మాటాడకండి. సంపి అవతల పారేస్తాను. పుట్టమీదెయ్యమన్నా యెయ్యను. ఆ తరువాత మెరమెరలొద్దు...." అంటాడు సత్తెయ్య.

"పాంవు కరవా కూడదు, పాపంవూ రాకూడదు" – అనే మంచి వాళ్ళెక్కడైనా వుంటారు కదా! – వాళ్ళకి ఈ ధోరణి నచ్చేది కాదు. "పోనీ" అని, పాంవుల రాంవులయ్యకి కబురంపుదాంవంటే, అందులో బోలెడు చిక్కులున్నాయి.

రాంవులయ్య అంతంత మాత్రంగా పాముని పట్టడు. చేటతో చేటడు బియ్యం; పాత గుడ్డా, ఒకటో రెండో రూపాయిలు కల్లు ఖర్చూ కాక, ఇచ్చుకోవల్సినవి యింకా వుంటాయి. ఇంతా చేస్తే, అంతటితో ఆపడు. ఆ యింట్లో యింకా పాంవులున్నాయంటాడు. ఆ యింటికి దిగ్బంధనం చెయ్యా లంటాడు. మంత్రాలు వేసి, ఇల్లల్లా బూడిద చల్లాలంటాడు. వంటింట్లోకి, దేంవుడి గదిలోకీ, చివరికి భోషాణపెట్టె గదిలోకీ కూడా తనే రావాలంటాడు. వాడు చెప్పిందంతా చేస్తే ఓ చిక్కు, చెయ్యకపోతే అంతకన్నా పెద్ద చిక్కు. అందుచేత, సత్తెయ్య షరతులకే తలొగ్గుతారు చాలామంది. కాణీ ఖర్చు మందు, జీవకారుణ్యం, గీవ కారుణ్యం నిలవడం కష్టం – ముఖ్యంగా పల్లెటూళ్ళల్లో.

అయితే, పదిమందికి లాభం ఎక్కడో, ఒకడికి నష్టం అక్కడ ఎలాగా తప్పదు. పాంవుల రాంవులయ్యకి, అమ్ముకోడానికో, ఆడించుకోడానికో ఓ నెల నెలా ఎన్నో కొన్ని పాంవులు దొరికేవి. అవి ఇప్పుడు పోయేయి. పైగా, అతని వృత్తికి మోనం వస్తోంది. అది రాంవులయ్యకి మహాకంటగింపుగా వుండేది.

సత్తెయ్య పాంవుల యెడల భయభక్తులు నాశనం చెయ్యడమే కాకుండా, మంత్ర తంత్రాల పట్ల విశ్వాసాలు కూడా లేకుండా పాడుచేసేవాడు.

కొన్నేళ్ళ క్రితం బర్మానుంచి ఓ భార్యా, భర్తా వచ్చారు. వాళ్ళు పరిగెత్తే పాముల్ని ఒడిసిపట్టి, తలలు నరికి చర్మాలు ఒలుచుకునేవారు. (మాంసం వొండుకు తినేవారని కూడా వినికిడుంది) "ఎందుకు"? అంటే అమ్ముకుంటాం; డబ్బులొస్తాయనేవారు. అలాంటి వాళ్ళదగ్గిర మందులూ మంత్రాలూ ఉండవా? అని సత్యంవాళ్ళ వెంట తిరిగేడు.

మందులూ లేవు; మంత్రాలూ లేవు. లోకంలో కొన్ని వేల రకాల పాములున్నాయట. అందులో డజనో, అరడజనో – అవి కరిస్తే యే మంత్రాలూ యే మందులూ పనిచెయ్యవ్. తక్కినవి కరిస్తే, మంత్రం వేసినా, వెయ్యక పోయినా బతుకుతారట. ఇలాటి రహస్యాలు చెప్పి – "పాంవులికి చెవులు మహా సున్నితం అంటారు గదా! వాటి కసలు చెవులే లేవు" – అన్నాడు బర్మావాడు.

బర్మావాడి దగ్గర కొన్ని ఒడుపులూ, మెళుకువలూ మాత్రం తెలుసుకున్నాడు సత్తెయ్య. తనకు తెలిసిన విషయాలు వేటినీ రహస్యంగా దాచలేదతను.

అందుకే, రాంవులయ్యకి అతనంటే మరీ మంట –

"అవునయ్యా! వొయిస్ కులుకురా భాత్ కులుకురా అన్నారు పెద్దలు. ఆయనగారికి (అంటే సత్తెయ్యకి) మొన్న కోసిన బొడ్డింకా వూణ్నేలేదు. ఆ బొడ్డేనా ఎవరు కోసినారు? మా యింటిదాయే కదా! రేప్పొద్దున్న ఆళ్లాడ మనిసికి నొప్పులొస్తే, మల్లా మా యాడమనిసినే పిలవాల. అలాటి యిస్వాసంవన్నా నేదు. – ఆ పెద్ద మనిసికి!..... ఏటో సెపతాడు కబుర్లు! పాంవు మంత్రం ఉందనడానిగ్గాని, నేదనడానిగ్గాని ఆయనెవుడు? నానెవణ్ని? బర్మా వాడెవడో కాదంటేనూ, యీన నేదంటేనూ పోడానికి అది నిన్నా మొన్నా పుట్టిన మాయా మంత్రం కాదు. ఎప్పుడో ఈస్సెరుడు పాంవుని పుట్టించి బూమ్మీది కొగ్గినప్పుడే, పామ్మంత్రం కూడా ఒగ్గినాడు. అదుందో నేదో యిప్పుడల్లా తెల్దు. ఆళ్ళయ్యకి అవసరంవొచ్చినట్టే ఆయినికీ ఆ అవసరం వొస్తాది. అప్పుడు

తెలుస్తాది – "మంత్రంవంటె యేటో, మంత్రగాడంటే ఏటో – ఆ మజా!" అంటూ తలలాడించేవాడు రాంవులయ్య.

కొందరు మనుషులికి పాములంటే ఎంత భయమో, పాముల వాళ్ళంటే అంతకు రెట్టింపు జడుపుంటుంది.

'ఏంవుంది? వాడిక్కోపం వచ్చిందంటే, నీ గుమ్మం ముందు ఓ నాగుపాము; వదిలేస్తాడు. అర్ధరాత్రి నువ్వు తలుపు తీసుకొని ఒంటేలు కొస్తావు అంతేం బుజువా, సాక్ష్యవా, కేసా? అంత చులాగ్గా తీర్చగలడు పగ. అందుకే "పాము పగైనా మొయ్యొచ్చుగాని, పావుంలాడి పగ మొయ్యలేం" వంటారు జనం.

ఆ మాట అని భర్తను మళ్ళించబోయింది రత్నాలు. రత్నాలంటే సత్తెయ్యకి చాలా అభిమానం. అయినా కొన్ని విషయాల్లో ఆమె మాట ఒక్క అక్షరం కూడా పట్టించుకోడు.

ఓ రోజు –

"పోనీ, యీ యింట్ల దూరిన పాంవుని నువ్ సంపు. నాను కాదన్ను. ఎవళ అటక మీదో ఉన్న పాంవుని నువ్వేల సంపాల?" అంది రత్నాలు.

దానికి జవాబియ్యక పోయేసరికి ఊరుకోలేదు. "సెప్పు సెప్పు" అంటూ చెప్పిందాకా ఒప్పనంది.

రత్నాలు భయానికి ఓ అర్థముంది. అతనుచేసే పనివల్ల వొరిగేది యేంవీ ఉండదు. పోతే, పోయేవి అణా బేడా, అడ్డెడు బియ్యమో, పాత గుడ్డో కాదు;

– నూరేళ్ళు బతకవలసిన నిండు ప్రాణాలు.

అయితే, ఎలా చేస్తే ఏం చెప్తే ఆమె భయం తొలిగిపోతుందో సత్తెయ్యకు తెలీదు. తనభయం ఎలా తొలగిందో, ఏ చైతన్యం అందుకు కారణమో గ్రహించగలిగే వూహ సత్తెయ్యకి లేదు. ఉన్నా, పనిలో నేర్పేగాని మాట నేర్పు నేర్చుకోలేదు. దానాదీనా ఏం మాట్లాడ్డానికీ అతనికి తోచలేదు.

'చెప్పు, చెప్పు' అని మరీ వేధిస్తే చివరి కిలా అన్నాడు.

'ఒకలా గనుకుందాంవు. ఇప్పుడు నానే ఉన్నాను. మా నాయి నున్నాడు. ముసిల్దీ, ముసిలోడూ, నీ కొడుకూ మాం వందరం ఒక్కాడ తొంగున్నాం. పాంవొచ్చింది. పాంవు సూర్లోంచి దిగింది. దువ్వారంవొద్దున దిగింది. నువ్ గడపట్ల ఉన్నావ్. తెలిగేసున్నావు. పాంవు న్నువ్వు సూసినావ్. కర్రకూడా నీ సేతి కందువిడిగింది. పాంవు నీ కాసి సూణ్నేదు. మా మీదికి పారొస్తోంది.... నువ్వేటి సేస్తావ్? నీ మీదికి రాడంనేదు కదా! మా మీదిక్కదా పారొస్తోంది. సస్తే మాంవు కదా సస్తాం. అలాగని నువ్వూరు కుంటావా? నీ పేణంవేన వొదిలి మమ్మల్ని కాపాడతావా?" అన్నాడు సత్తెయ్య.

రత్నాలు సులువుగానే జవాబిచ్చింది.

"నువు – మీరంతా నాకైనట్టు యీ లోకవంతా నీకొద్దా?"

"అవుద్ది."

అంత తడువు కోకుండా జవాబొచ్చేసరికి రత్నానికి ఎదురు జవాబు లేకపోయింది.

"అయితే సరే!" అంటూ తల తిప్పేసింది.

ఆమెకు కళ్లంబడి నీళ్లెందుకు వచ్చేయో, వాటిని ఆపడం వెలాగో అతనిక్కాని, ఆమెక్కాని తెలీలేదు.

కొంతసేపు మాటాడకుండా కూచుని, సత్తెయ్య అన్నాడు – "అవుద్దా అవదా? – అంటే మనం అనుకోడంలో వుంటాది, కొందరికి తల్లే తల్లి కాదు. కట్టుకున్న పెల్లం, కనుక్కున్న పిల్లలూ, సుట్టాలూ, పక్కాలు – ఎవ్వరూ ఏంవీ కారు. సచ్చినా బతికినా, ఆడికి ఆడొక్కడే! ఎవరెన్నిందాల పోయినా, ఆడు మాత్రం సల్ల గుండాల!.... నీలాటి దాయుందంటే, దానికి దాని మొగుడూ, పిల్లలూ, దానత్త మావంలూ, యిరుగూ పొరుగూ సల్లగుంటే దాని బతుకెలాగ పోయినా దానికి లక్షెంలేదు. తను పస్తులున్నా ఆళ కడుపులు నిండాలంటది. తను సెంవటోడ్చి తెచ్చిన నూకలు గంజికాసి, ఆళకి పోస్తాది. తనకి కట్టిందికి మారు కోక లేకపోయినా, ఆళకి కప్పుకుందికి దుప్పటి కావాలంటది. కుటాంబం అక్కడితో సరనుకుంటే సరి.... కుటాంబం మరి కసింత పెద్దదయిందనుకుంటే, ఊరందరూ దాని మనుషులే అవుతారు. అప్పుడు ఊళ్ళో ఎవరి కొచ్చిన కష్టంవేనా, దాని కష్టంవే అవుద్ది."

ఈ వాదనంతా అవుతున్నప్పుడు అక్కడ ఇంకో మనిషి కూడా వుంది. ఆమె సత్తెయ్యకు కాని, అతని భార్యకి కాని ఏ విధానా బంధువు కాదు. అసలు ఆమెదీ, వాళ్ళదీ ఒక కులమైనా కాదు. అయినా, 'అప్పా,' 'సెల్లెలా', 'మరిదీ' అంటూ వరసలున్నాయి. ఆ వొదిన, మరిదిని అడిగింది –

"సరే, యిదొక్క మాటికి జవాబు సెప్పు. నీకు నీ కుటాంబంవంటె యెంత బిమానంవో, యీ లోకంవంతటి మీదా అంతబిమానంవూ వుండొచ్చు! అది మంచిమాటే! దాన్ని నాను కాదన్ను. కాని, నువ్వేమైన అయితే యీల్ల గతేటొద్ది?"

"ఆల్లే టైనయితే, నాగతేటొద్ది?" టక్కన అన్నాడు సత్తెయ్య.

"సక్కంగ ఇంకో కొత్త పెల్లాన్ని తెచ్చుకోని కాలుమీద కాలేసుకోని రాజునా గనుబవిస్తావు" అంది వొదినమ్మ.

"అయితే, మీ సెల్లెలూ ఆ పనే సేస్తది అన్నాడు సత్తెయ్య నవ్వుంతూ.

"ఆడదానికీ, మొగోడికీ ఒకటేనా?"

"ఏంవీ! పిల్లలమీద మారు మనుంవెల్లినోళ్ళు లేరేటి?"

"ఉంటే వుంటారు. అందరెల్ల గల్తురా?"

"పోనీ, అలాగే అనుకుందువు. సచ్చినోల్లంత పాంవు కరిస్తేనే సస్తన్నారా?"

"నిజంవే. అలాగనెల్లి అగ్గిలో దూకు!" అంది వొదినమ్మ కోపంగా.

"నా నగ్గిలో దూకడం నేదు. కొంపలంటుకుంటేనే,

ఆర్పడాని కెల్తన్నాను" అని, కొంతసేపు పోయేక మళ్ళీ మొదటి కొస్తూ ఇలా అన్నాడు సత్తెయ్య –

"జనవేటనుకుంటారంటే, అప్పుడెప్పుడో మా యయ్యని పాఁవు కరిసిందని – ఆ కసికొద్ది పాఁవుల్ని సంపుతా ననుకుంటారు. పాఁవంటే నాకు పగకాదు … పాఁవు మనిసిని కుడతాది. మనిసికి పాఁవంటె బయం. పాఁవుని సూస్తే సావుని సూసినంత బయం. సావుకి బయపణ్నోడు ఒక్కడే పాఁవుకి బయపడ్డు. సిన్నప్పుడు కండసీఁవని సూసి బయపడినాను. పెద్దయినాక పాఁవు… సీవైనా, పాఁవైనా, సావైనా నాకొక్కటే! అదెప్పుడో కాటేస్తదో యెయ్యదో. దాని బయ్యం మనిసిని తినేస్తుంటది పురుగునాగ. ఎదురు తిరిగితె ఏటీనేదు. నీ సెయ్యే పైని! అప్పుడు సావూ, పాఁవూ కూడా సీఁవల్లా సిన్నవయి పోతాయి – నీ ముందు."

– "అంటూ, సత్తెయ్య అక్కణ్నుంచి లేచిపోయేడు.

★ ★ ★

ఊళ్ళో కోతల టైము. మగపురుగన్నది కనిపించదు. ఎండిన చేను బళ్ళ కెత్తుకున్నారు. ఎంకునాయుడుగారి కళ్ళంలో కుప్పలేస్తున్నారు.

మొదట ఒక బండి పెరిగి, రెండోది పెరుగుతున్నాడు సత్తెయ్య. ఎంకు నాయుడు గారి కోడెగిత్తలు…. కొత్తవి. ఊఁ హూ…. చిరమరలాడుతున్నాయి. కొత్తవడంవల్ల సత్తెయ్యని మరీ మొరాయిస్తున్నాయి.

బండి, ఎగవీధి గోర్జి కొచ్చింది. ఎక్కణ్ణించోగాని, ఎదురుగా వచ్చేస్తోంది సుబ్బాయమ్మగారు.

ఏభయ్యేళ్ళ మహాకాయం! ఆ కాయానికి నడవడమే గొప్ప కష్టం. అలాటిది – ఆవిడ పరిగెడుతున్నట్టుంది కాని నడకలా లేదు!

"బాబ్బాబు! ఒరే, సత్తెయ్యా! ఒక్కమాటు బండీ ఆపవూ? ఒక్కమాటు! నీ కోసఁవే వెళ్ళేనురా! మీ ఇంటినించే వొస్తున్నాను. నా తండ్రివి కదూ! ఒక్కసారి బండీ ఆపు! ఒక్కసారి!…"

– అంటూ రొప్పూ పోసి పోతూ, ఆయేస పడిపోతోంది.

"ఒహో" లతో; అతి కష్టంమీద ఆపి, తనకి అప్పుడు "తీర"దని చెప్పబోయేడు సత్తెయ్య.

వారం రోజుల క్రితం, సుబ్బాయమ్మగారు కొబ్బరికాయలు దింపమంది. ఆ చెట్టు యిక్ష్వాకుల నాటిది. మామూలు చెట్లు రెండు ఎక్కితే గాని, ఆ చెట్టు ఎక్కినట్టు కాదు. అంత ఎత్తున మాను, మరీ సన్నం. దాని మీద గెద్దలు పట్లు పెట్టేయి. ఆ చెట్టు సత్తెయ్య తప్ప యెవ్వడూ ఎక్కడు. ఎక్కడవంటే, గంటా గంటన్నర పని! సగం ఎక్కేసరికి గెద్దలతో యుద్ధం. అలా యుద్ధమాడు తూనే, చివరికంటా ఎక్కాలి! యాసగాలి వీచిందంటే, మనిషి నిలాగ ఎత్తి పారేస్తుంది. అలాగే చెట్టెక్కాలి; అలాగే కాయలు దించాలి.

అంతకష్టం వున్నా, దానికి కూడా అన్ని చెట్లకిచ్చినట్టే "ఒక సచ్చు కొబ్బరికాయి" యిస్తాది సుబ్బాయమ్మ! కనికరించి మాగాయి కాదు, ఒక పచ్చడి రవ్వైన పెట్టదు!

పెట్టదని కాదు; తనకు తీరికలేకే, కాదన్నాడు సత్తెయ్య. "ఇప్పుడు సెట్టక్క మంటాది గాఁవాల. ఏం దారి?" అనుకొంటూనే, బండి ఆపేడతను. కాదంది సుబ్బాయమ్మ. తరవాత తీరికైనప్పుడే దించొచ్చునంది.

అయితే, మరేవిటో చెప్పమ్మా! అంటే, చెప్పదు! "నువు రా! నే చెపతా" నంటుంది. ఎద్లు ఆగవంటే, దారినిపోయే జానాబెత్తెడు గుంటణ్ణొకణ్ణి బండికి కాపు పెట్టింది. ఆ యమ్మ పట్టుకుంటే మరి వదల్దు! సరే అని లోపలికి వెళ్లేడు సత్తెయ్య.

వీధి వాకిలి దాటేరు; పెంకుటిల్లు గడిచేరు. రెండిళ్ళ వాకిలి చిన్నదే. ఆ వెనక వుంది పూరిల్లు. అక్కడికి వెళ్ళిందాకా, మాటాడలేదు సుబ్బాయమ్మగారు.

పూరింటి అరుగులు ఎత్తు. కమ్మరేకులు చప్పుడైతే, పన్నెండు కళ్ళు ఒక్కసారి చూసేయి. చిన్నా పెద్దా, అరడజను మంది – రెప్పలల్లారిస్తే చప్పుడౌ తుందన్నట్టు – గట్టిగా వూపిరితీస్తే ఎవరు దెబ్బలాడతారో అన్నట్టు – ప్రాణాలున్నా లేని బొమ్మల్లా వున్నారు.

అదిగో అన్నట్టు వేలుతో చూపించి ఓ పక్కకి ఓసరిల్లేడు పెద్ద మనిషి. ఆయనెక్కడో చూసినట్టు సత్తెయ్యకి జ్ఞాపకం. సుబ్బాయమ్మగారి పెద్ద కొడుకై వుండాల! అక్కడ పుట్టిన వాడే! ఆ వూరి వాడే. కాని, ఇప్పుడు పట్నంలో ఎక్కడో ఉంటున్నాడు. జనం అతని గురించి చెప్పుకోడమే సత్తెయ్య ఎరుగును అతనూ ఎప్పుడూ తారసపడలేదు.

కుండలూ, మండలూ, పాత గూనలతో అస్తవ్యస్తంగా అధ్వాన్నంగా వుంది పూరిల్లు. తలుపు వొద్దునే తవుడు బస్తా, పాత తిరగళ్ళూ ఉన్నాయి. తూర్పు గోడకీ, దక్షిణ గోడకీ మందడిని ఒక పాత గోలెం ఓరిగిలి ఉంది. దాన్ని తొలిగించి గుర్తుగా దాని తాలూకు గుండ్రని ముద్ర. ఆ మూలని ఉంది. ఆ మూల, ఎలకో, పంది కొక్కులో నేల గొప్పులు పెట్టేయి.

ఆ గొప్పిలోంచి తెల్లగా నల్లగా పాము తోక స్పష్టంగా కనిపిస్తోంది.

సత్తెయ్య దగ్గరగా వెళ్ళి ఓ సారి చూసి వచ్చేడు. చప్పుడు చెయ్యకుండా గోలేన్ని ఎత్తి పక్కన పెట్టేడు.

సుబ్బాయమ్మగారు మొదాట చూసేసరికి, మూరెడు పైనుండేదిట. అంత కంతకీ లోపలికెళ్ళి ఇప్పుడు జానన్నర పైని వుంది.

ఎంత ఆలోచించినా సత్తెయ్యకి ఏ ఉపాయమూ తోచినట్టు లేదు. లాభం లేదన్నట్టు తల అడ్డంగా తిప్పేసేడు.

ఆశతో చూస్తున్న సుబ్బాయమ్మగారికి నడుం నటుక్కుమని

పోయింది. 'ఇలారా!' అన్నట్టు సైగచేసి, రెండిళ్ళ వాకిట్లోకి దారితీసిందావిడ.

ఆలోచిస్తూ, ఆమెతోటే వచ్చిన సత్తెయ్య ముంజూరు దగ్గిరే ఆగిపోయేడు. తోబుట్టువు దగ్గిరికో, పెద్దకొడుకు దగ్గిరికో చేరినంత చనువుగా చేరింది సుబ్బాయమ్మ గారు. గెడ్డం పట్టుకోడం తరవాయి. అంత చేసినట్టు సత్తెయ్యని బతిమాలిందావిడ.

పెద్దకొడుకూ, కోడలూ నిన్ననే వచ్చేరట; నత్తా, నావా – అతనికి అరడజను సంతానం (పిల్లల్ని కూడా చూపించింది సుబ్బాయమ్మగారు). రెండోవాడూ, ఆడపిల్లా నాలుగైదు రోజుల్లో వస్తారు. చంటీ వెంటీ – వాళ్ళకి ఓ ఐదారుగురు పిల్ల లున్నారట. ఇహ, పిల్లలేవిటీ – పొద్దస్తమానం ఆ పూరింట్లోనే ఉంటారు. వద్దర్రా! పురుగూ పుట్రా వుంటుందని చెప్పినా వినిపించుకోరు.

ఆ పాముని ఇంట్లో పెట్టుకొని ఆవిడ బతకలేదు. నాలుగు రోజుల కిందట పాము జాడ పసికట్టినప్పుడే ఆవిడ భయపడింది. ఇవాళ ఎందుకో గోలెం తియ్యబోతే, అక్కడ ప్రత్యక్షము! అప్పణ్ణించీ ఆవిడకి కరచరణాలు ఆడ్డం లేదు: పాముకి కాపు పెట్టి, తను వీధిని పడింది. కబురు పెడదాఁ వన్నా మనుషులు కనిపించరు. (– వెధవ కోతర్రోజులు!")

– ఇలా తన కష్టాలన్నీ చెప్పుకొని, చివరికి – ఎలాగో ఓలాగ, ఏం సుళువు చేస్తాడో తనకు తెలీదు; ఆ పాము పని పట్టీమంది సుబ్బాయమ్మగారు.

ఎంత కాదనుకున్నా, సత్తెయ్యకి ఆమెపట్లా, ఆమె సంతానంపట్లా జాలి ఆగలేదు. మనసు మెత్తపడగానే, దుస్సాహసం పెరుగుతుంది.

"ఒక్క సుళువుంది" నసుగుతూ అన్నాడు సత్తెయ్య. అని ఆ పక్కనే వున్న పెద్దబ్బాయి కేసి అంచనాగా చూసేడు ఒక్క క్షణం.

నున్నగా, తెల్లగా .... అందమైన టెర్లిన్ జుబ్బాలో, పెద్దాపురం సిల్కు లుంగీ చుట్టుకుని ఉన్నాడు పెద్దబ్బాయి. చెప్పడానికీ, చేయించడానికే కాని, పని చెయ్యడానికి మనిషి కాదతను.

"కాని, లాబం నేదు" అంటూ తల తిప్పేసేడు సత్తెయ్య.

"ఏఁవిటది?" అంది సుబ్బాయ్యమ్మగారు. ఆవిడ కూడా ఆలోచిస్తూనే ఉంది.

"ఏటీ నేదు! పాఁవులోడికి కబురెట్టండి" అన్నాడు సత్తెయ్య.

"అది మాత్రం జరగదు! వాడితో, ఆ పాట్లన్నీ నే పళ్లేను. పాల ముంచినా, నీటముంచినా నిన్నే నమ్ముకున్నాను. పిల్లా పాపతో చల్లగా పండుగ చేసుకోనిస్తే, ఆ పుణ్యఁవంతా నీదే! లేదా, రేపే ఆ ఉన్న వాళ్ళిద్దరికీ వుత్తరాలు రాయించే స్తాను. వీళ్ళని కూడా తెల్లారీసరికి బండెక్కించేస్తాను. ఇహ, ముసలాయనా నేనూ నంటావా, ఉన్నా ఒకటే! వూణ్నా వొకటే!" అంది సుబ్బాయమ్మగారు.

సుబ్బాయమ్మగారు అన్నంతపనీ చేస్తుందని కాదు కాని, సత్తెయ్య సహజం గానే ఇంకో ఉపాయం కోసం వెతుకుతున్నాడు.

"ధయిర్యఁవైనోడు, యింకొక్క మనిసి దొరికినా బాగుణ్ణు!" అన్నాడు సత్తెయ్య –– 'నేనేం చేతు' నన్నట్టు.

"ఉంటే?" అన్నాడు పెద్దబ్బాయి.

"ఏఁవీనేదు. పాఁవుని తోకట్టుకోని లాగి ఇవతలికి ఇసిరేస్తాను. అది నేలమీదడగానే, టక్కన మెడమీదెట్టీయాల!"

ఇంతేనా! అన్నట్టు అమ్మ మొఖంలోకి చూసేడు అబ్బాయి. ఆ చూపు చూస్తూనే, తుళ్ళిపడింది సుబ్బాయమ్మగారు.

"అబ్బే! లాభం లేదొరే! నీకు తెలీదా కొట్టడాలు! పాఁవుని కొట్టడఁవంటే మాటలు కాదు. నేను అవతలకెళ్ళి ఎవడేనా సొమ్ములకాపు గుంటడు కనిపిస్తే, పిలుచు కొస్తాను" అంటూ అవతల వాళ్ళు, ఏమనిపోతారో అన్నట్టు తొందరగా బయలుదేర బోయిందావిడ.

ఇంతట్లో – పూరింటిలోంచి పదేళ్ళ మనఁవడు పరిగెత్తుకొచ్చేడు.

''మావ్మా! మావ్మా!..... పాఁవే, ఇంకొంచెం లోపలికెళ్ళిందే!" అంటూ ఎంత లోపలి కెళ్ళిందో వేలు మీద చూపించేడు.

సుబ్బామ్మగారికి పట్టరాని కోపం వచ్చింది.

"నిన్ను అక్కడి కెళ్ళొద్దన్నానా?.... చెపితే మనిషివి కావూ! ఫో! అవతలికి పో!" అంటూ మనవణ్ని వీధి ద్వారం కేసి తోసుకుంటూ పోయింది.

ఆవిణ్ణి అటు వెళ్ళనిచ్చి, సత్తెయ్యా అబ్బాయిగారూ లోపలికి వెళ్ళేరు. పాము తోక ఇంకా బయటే వుంది. కనిపించకపోయినా, అది క్రమంగా కదుల్తూనే వుంది.

"అది ఎరమింగి, కదల్నేప్పోతే దాన్ని సంపీడం సులువే. ఎర కోసం గుద్దులాడుతుంటే – అలాటప్పుడు దేంజరు." అన్నాడు సత్తెయ్య పరిస్థితిని వూహిస్తూ.

ఇంతలో, సుబ్బాయమ్మగారు ఓ సొమ్ముల కాపరిని వెంటబెట్టుకొని వచ్చింది. కుర్రాడికి, నిండా పదమూడేళ్ళుండవుగాని చాకులా వున్నాడు. సత్తెయ్యని చూస్తూనే, "నువ్వున్నావేటి? ఐతె, నానుసఁయ్యే!" అన్నాడు హుషారుగా. ఆ కుర్రాణ్ణి "సొమ్ముల గురవడు" అంటారు.

తనేం చేస్తాడో, వాడేం చెయ్యాలో అంతా వివరంగా చెప్పేడు సత్తెయ్య.

"నీ కెందుకు? నాను తొలి దెబ్బకొడతాను. నువ్ మారందుకో" అన్నాడు కుర్రాడు.

వెంటనే, రెండు చేపాటి కర్రలతో తిరిగొచ్చేడు పెద్దబ్బాయి. ఒకటి సత్తెయ్య కిచ్చి, రెండోది కుర్రాడి కియ్యబోయేడు.

"మరి, నీకో?" అన్నాడు, సొమ్ముల గురవడు కర్ర అందుకోకుండా.

''వాడి కెందుకూ!.... వాడి కఖ్ఖర్లేదు.'' అంది సుబ్బాయమ్మగారు వెనువెంటనే.

ఆవిడ గొంతు ఎవరికైనా కటువుగా వినబడుతుంది. సొమ్ముల కుర్రాళ్ళు అలాంటి గొంతుకలు వినడానికి అసలు వొప్పుకోరు.

"మరి అత్తల (అవతల) పడితేనో? అన్నాడు గురవడు.

"అత్తల పడ్డా, యిత్తల (ఇవతల) పడ్డా – నువ్వే కొట్టాల" అన్నాడు సత్తెయ్య.

"నాను కొట్టను. నానెందుక్కొట్టాల?"

కుర్రాడికి తిక్కరేగుతోందని గ్రహించేడు సత్తెయ్య. సుబ్బాయమ్మగార్ని మాటాడొద్దని చెప్పి, తనకి చేతనైనంతలో వాడికి సర్ది చెప్పబోయేడు.

అంతా విని, ఒక్క మాటలో తీసి పారేసేడు, సొమ్ముల గురవడు.

''ఓయ్ ఊరుకోవయ్యా! పాఁవు దూరింది ఆళ్ళ యిరకలోనా?.... సాయానికి నువ్వూ, నేనా?.... చెయ్యి సాయం, తోడుండమంటే – ఎలాగ సస్తారో మీరిద్దరూ సావండి గాని, నా కొడుక్కి దాని గాలికూడ తగల్నానికి ఒల్లకాదంటాది ఆయమ్మ! యీయిడే కన్నాదేటి, కొడుకుని! నిన్నూ, నన్నూ అమ్మ కన్లేదేటి? .... నా నుండను" అంటూ వాడు వెళ్ళిపోబోయేడు.

పెద్దబ్బాయికి దేనిమీద కోపం వచ్చిందో, దేనికి వచ్చిందో కాని వచ్చింది. "నువ్వుండమ్మా!" అంటూ తల్లిని పక్కకి పెట్టేసి, "వెళ్ళరా" అని కుర్రాడికి ఆజ్ఞ పెట్టి, "కానీవోయ్" అంటూ సత్యానికి సెలవిచ్చేడతను.

"అద్గదీమాట. అలాగన్నావ్, నాకు నచ్చింది. నువ్విత్తల కాయ్, నా నత్తల కాస్తాను" అంటూ పెరటి గుమ్మం దగ్గిరికెళ్ళి నించున్నాడు సొమ్ముల గురవడు.

ఆమడ దూరంలో, ఈమధ్య – పిల్లా జెల్లా ఎవరూ లేరని తేల్చుకున్నాక, 'రడీ' అంటే, 'రడీ' అనుకొన్నారు. పెంకుటింటి చూరు కింద నిల్చున్న కోడలు కొంత ధైర్యంగానే వుందిగాని, రెండిళ్ళ వాకిట్లో నించున్న సుబ్బాయమ్మగారు మట్టుకు ఊరికినే గాభరా పడిపోతోంది.

ఒక్క చేతికి అలవి కాదనిపించగానే, చేతిలో కర్ర గోడకు చేరేసి, పాము తోకని రెండు చేతులా అందుకొన్నాడు సత్తెయ్య. ఈలోగా పాము ఎత్తు మార్చేసింది.

'బసుబుస' లాడుతూ చేతిలోకి వచ్చేస్తూంటే, హడావుడిగా లాగి అవతలకి విసిరీసేడు సత్తెయ్య. ఆ సందట్లో, చేతికర్ర కాస్తా కుండల ఇరుకున పడిపోయింది. పాము గోడ దెబ్బ తినకుండానే నేలను వాలింది.

ప్లాను ఫెయిలయ్యేసరికి, గోల మొదలయ్యింది. "కొట్టు! కొట్టు!" అంటాడు పెద్దబ్బాయి. "నువ్ కొట్టు! నాకంద" దంటాడు సొమ్ముల గురవడు. "నువ్వొద్దు! నువ్వొద్దు!.... నా మాట వినూ!" అంటుంది సుబ్బాయమ్మగారు కొడుకు నుద్దేశించి.

నేలమీద పాము యిటుజారి, అటుజారి ఎటు చూసినా మనిషే అయితే, వచ్చిన దిక్కుకే జరజర పోతోంది.

కుండల యిరుకునున్న కర్ర ఎంతకీ రాకపోయేసరికి, "కర్ర! కర్ర!" అని అరిచేడు సత్తెయ్య. పెద్దబ్బాయికి కర్ర విసిరేపాటి ధైర్యమైనా లేదు. 'అందుకో' అంటూ కుర్రాడే చేతికర్ర విసిరీసేడు.

సత్తెయ్య చెయ్యి చాచేడు కాని, కర్ర అందలేదు. పారే పాముకీ, అతనికీ మధ్యన చప్పుడు చేస్తూ పడిందా కర్ర.

కర్ర చప్పుడు వినగానే, కస్సున లేచింది పాము.

"ఓర్ నాయినో!" అంటూ సొమ్ముల కుర్రాడు గుమ్మం దగ్గిరికీ; ఎదరుపడ్డ అమ్మని తోసేసుకుంటూ పెద్దబ్బాయి రెండిళ్ళ వాకిట్లోకి పరుగులు తీసేరు.

'ఏఁవయ్యింది, యేఁవయ్యింది?" అంది పెద్దకోడలు.

"పాఁవు ఆ మనిషిని పొడిచేసింది" అన్నాడు పెద్దబ్బాయి.

ఆ మాట వింటూనే, వెనక్కి తిరిగేడు సొమ్ముల గురవడు.

మనిషి – కర్ర కోసం వంగబోయినప్పుడల్లా పడగెత్తిన పాము 'బస్సు' మంటూ బుసకొడుతోంది. 'పులీ పందీ వైరంగా' – పామూ, మనిషీ ఎదురు బొదురుగా నిలుచుండిపోయేరు.

"అంటిందేటి, అంటిందేటి?" అన్నాడు సొమ్ముల కుర్రాడు ఆత్రతగా.

సత్తెయ్యకి జవాబిచ్చే వ్యవధి లేదు. తల కొంచెం విసిరి, పామువంకే నిదానంగా చూస్తున్నాడు.

ఇక్కడ వెతికీ, అక్కడ వెతికీ అవతల ద్వారం దగ్గిర పడిన కర్ర కనబడగానే, ఒక్క గెంతు గెంతేడు గురవడు.

అలికిడికి అటుకేసి తిరిగిన పాము, ఇటు కర్రమీద చెయ్యి పడగానే 'టగ్'న విసిరింది పడగ.

"దీనెమ్మ...." అంటూ చప్'న నిల్చుండి పోయేడు సత్తెయ్య.

తొలిపోటు పొడిచిన వీరుళ్ళా, పాము మండీ మీద వూగులాడుతోంది. పడగ పెద్దదిచేస్తూ, పొడుగు పెంచుకుంటోంది.

ఎరుపెక్కిన కళ్ళతో, పాము వంక ఎర్రగా చూస్తాడే తప్ప యేం చెయ్యాలో తెలియకుండా ఉంది సత్తెయ్యకి.

క(త్రతో తిరిగొచ్చిన గురవడు "నువ్ తగ్గు! నువ్ తగ్గు!" అంటూ క(రెత్తి, వాటం కోసం చూస్తున్నాడు.

ఒక్క క్షణం!

ఒక్కటే క్షణం –

చెయ్యి 'చాప్'న చాచడం, పడగ 'ఫాట్'న విసరడం ఒక్కసారే జరిగి పోయేయి.

ఎంత వేగం విసిరిందో, అంత వేగం వెనక్కి తీసుకుంది పాము. ఎత్తిన పడగకి బెత్తెడు ఎడంగా పడింది క(ర.

ఒకటి ... రెండు... మూడు.... నాలుగు దెబ్బల్తో పాము నడ్డి విరిగిపోయింది.

అంతలో క(ర అందుకున్న సత్తెయ్య ఆచి, ఒక్క పోటు పొడిచేడు పడగమీద.

★ ★ ★

ఎ(ర్రగా, నల్లగా – ముఖం, నల్లగా, అతి ఎ(ర్రగా పెదవులతో చూరుదూరి బయటికి వస్తున్న సత్తెయ్యని "యేఁ వయ్యింది, యేఁవయ్యింద"ని అడగలేదు సుబ్బాయమ్మగారు. "చంపేసేర్రా, బాబూ! కొసంటా చంపేసేరా? ఏ తోకనైనా గుడుగుడు జీవాలుంచీసేరా?'' అంటూ పూరింట్లో కెళిపోయింది. "అయ్యో! కొస (పేణం ఇంకా ఉండి పోయిందర్రా!" అంటూ ఆవిడ తిరిగొచ్చేసరికి అక్కడ ఎవరూ లేరు.

★ ★ ★

ఆ మధ్యాహ్నం, అంబళ్ళ వేళకి వీధుల్లో ఎక్కడ చూసినా మనుషులే. సత్తెయ్యని పాము ముట్టిందనే దుర్వార్త పూరు చుట్టి రావడమేకాక, పొలిమేరలు కూడా దాటిపోయింది.

తీర్థప్రజల్లాగా వచ్చే జనం వస్తూనే వున్నారు; పోయేవాళ్ళు పోతూనే వున్నారు.

సత్తెయ్య ఉండే సందు – మరీ యిరుకు జంతి. చాలామంది మండపం దగ్గిరే ఆగిపోతున్నారు. కొందరు మండపం నించి పాఁవుల రాఁవులయ్య గుడిసెకీ, అక్కణ్నించి మళ్ళీ మండపానికీ – ఆసులో కండెల్లాగ తిరగుతున్నారు.

ఎందరొచ్చినా, ఎన్నికబుర్లు మోసినా రాఁవులయ్య దొక్కటే జవాబు.

"ఆయినగారు కబురంపినాడా?.... అంపితే సెప్పండి యిప్పుడెళ్ళి పోదాం!.... పొద్దున బట్టి, నా నిల్లెందు కొదల్లేదు?.... ఏఁవో, యెప్పుడు మనసు మారతాదో; మాటపడిపోతాఁవనే కదా!..... " అంటూ అవతల వాణ్ణి నోరు మెదప నియ్యకుండా మాటాడుతున్నాడు పాఁవుల రాఁవులయ్య.

మొట్టమొదట ఈ కబురు తెచ్చిన సొమ్ముల గురవడికి ఏం జవాబు చెప్పేడో, చిట్టచివర కబురు తెచ్చిన పెద్దనాయుడుగారి మనిషికీ అదే జవాబు.

ఇంటికి వచ్చిన దగ్గిర్నుంచీ, సత్తెయ్య అరుగు చివరనే పడక వేసేడు. గంటలు గడిచిన కొద్దీ అతనికి మగత పెరుగుతోంది. ఆ మగతలోనే, అతనికి మధ్య మధ్య తెలివొస్తోంది. అలా వచ్చినప్పుడల్లా, మండ కరిచి రక్తం చీకు తున్నాడు.

అతను ఉమ్ముతున్న రక్తపు కెళ్ళలతో వాకిలి తడుస్తోంది. ఆ – దాగరంత మేరా వదిలి, జనం దడి కట్టేసేరు. వాకిటనిండా, చూరుల్లోంచి, అరుగుల మీదా, చీకటి గదిలోనూ – ఎక్కడ చూసినా మొహాలు మొహాలు – కాళ్ళూ చేతులూ...అంతమంది చుట్టూ ఉన్నా ఒక్కరూ మాటాడరు.

"ఏడ నియ్యడమ్మా! దాన్ని ఏణ్నియ్యడు! దాన్నే కాదు. ఎవళూ ఏడ వొద్దంటాడు. కిక్కురు వక్కురు మనకండ, అంత బరువు మొయ్యడానికి – దాన్ది గుండా, సెరువు? ఎంతసేపు కాస్తదీ!" అంటోంది, డెబ్బయేళ్ళ ముసిలిది, నాయనమ్మ.

రత్నాలు నెలలు నిండిన మనిషి. అలాగే, వోడలా కదుల్తోంది. ఎంతసేపూ, ఆమె ద్వారం దగ్గిరే ఉంటోంది. అది విడిచి లోపలి కెళ్ళలేదు; బైటికీ రాలేదు.

"...... బతికిన్నాడూ, సచ్చిన్నాడూ బయఁవెరగడు మనిషి. పాఁవుమీద పగ పట్టిన్నాడే, పేణాలమీద ఆశ ఒగ్గుకున్నాడు.... అంసలాగ బతికిందికి అర్నెల్లు సాలు! ఉంటాం, నువ్వూ నేనూ. ఎంతకాలఁవైనా ఒక్కటే...."

– జనం ఎన్నెన్నో విధాల చెప్పుకుంటున్నారు.

వచ్చేపోయే జనంలో కొందరు 'ఎగువీధి' గుండా పోతున్నారు.

"ఇదిగో, ఇక్కడే – యియ్యింట్లోనే ముదనష్టప్పాఁవు ముట్టేసింది. అది గది గద్దో; ఆ పెరట్లోంచి ఇంట్లో కొస్తోంది, ఆయమ్మే – పాపం, సేను పెరుగుతున్నోణ్ణి సంపనానికి పిలిసింది."

చిన్నపిల్లలూ; ఆడవాళ్ళూ సుబ్బాయమ్మగారి వేపూ, ఆవిడ ఇంటివేపూ చెయ్యిత్తి చూపిస్తే వెళుతున్నారు.

ఊరు పూరంతా సత్తెయ్య ఇంటిచుట్టూ మూగుతున్నసమయంలో, ఊరికి దూరంగా మందమధ్య నున్నాడు – సొమ్ముల గురవడు.

సత్తెయ్యకి కోరలు నాటేయని తెలగానే, పాఁవుల రాఁవులయ్య ఇంటికి పరిగెత్తేడు గురవడు. అతను చెప్పినదంతా విని, "పాఁవెలా గుంటుంది?" అన్నాడు రాఁవులయ్య. "ఫలానాలా; ఫలానాలా" అన్నాడు గురవడు. "అయితే సత్తెయ్య పిలవమన్నాడా?.... నువ్వే పారొచ్చినావా?" అన్నాడు

మధ్యలో. దానికి కుర్రాడు జవాబు ఇస్తూ ఉంటే, "సత్తెయ్య ధైర్య మెలాగుంది?" అన్నాడు రాఁవులయ్య. ఆ సంగతి చెప్తూవుంటే విననట్టూ, వినిపించుకోనట్టూ, మొహం పెట్టి, "ఉఁహూ... నా(న్రాను. నానొచ్చి లాబఁవేటీ? .... మంత్రానికేనా, తంత్రానికేనా ఓ నమ్మకం వుండాల. నమ్మకం లేన్చోట మంతరం ఎక్కదు. ఎక్కినా పన్చెయ్యదు. వచ్చేదు.... యెళ్ళేదు – అన్న పేరేగాని, మాట దక్కదు" అంటూ తలా తోకా లేకుండా మాటాడేడు రాఁవులయ్య.

రాఁవులయ్యని నప్పించి, ఒప్పించుదామని ఎంతోసేపు అతని గుమ్మంలోనే కూచున్నాడు సొమ్ముల గురవడు. ఎన్నిచెప్పినా, యేం చెప్పినా పాములవాడు కదలడు... ఎందరొచ్చి చెప్పినా అతని దొక్కటే మాట. చివరికి విసిగిపోయి, అక్కణ్ణుంచి లేచిపోయేడు గురవడు.

లేచి, తిన్నగా ఎక్కడికి వెళ్ళడం?

సత్తెయ్య దగ్గిరికి వెళ్ళడానికి వాడికి మనసు ఒప్పలేదు. బతుకుతాడో చస్తాడో ఏదైనా తను అక్కడ చేసేదేమీ లేదు. ఊరవతల సొమ్ములు తన కోసం ఎదురు చూస్తున్నాయి. మందకేసి నడిచేదు గురవడు.

అతనక్కడికి వచ్చేసరికి తోటి సొమ్ముల కాపర్లు అంతా సత్తెయ్య ఇంటికి పోయుంటారు – ఒక్కడూ కనిపించలేదు. చల్లని నీడా, శుభ్రమైన నేలా కనిపించగానే చతికిల పడ్డాడతను.

గురవడు, దారి పొడుగునా ఆలోచిస్తూనే ఉన్నాడు. వాడు ఈ లోకంలోకి దిగి దాదాపు పదమూడేళ్ళవుతుంది. కాని, ఇవాళే మొట్టమొదటిసారిగా దీనివంక చూసినట్టూ, ఇంతకాలం తనున్న వూరు ఇంకోటీ, తన చుట్టూ ఉన్న మనుషులు కొత్త అయినట్టూ – అంతా అయోమయంగా ఉంది.

వాడు నిత్యం చూసే మందే, ఆ మందలో పశువులే వాడికి కొత్తగా కనిపిస్తున్నాయి.

.... ఎర్రగా ఎండుగా ఉండే ఆ లక్కాపు సత్తెయ్యగారి ఇంట పుట్టిన పడ్డట. ఎప్పటికీ ఎత్తిరిల్లని ఆ బక్కి గోవుని చూస్తే, ఇన్నాళ్ళూ ఏదో చెప్పరాని చిరాగ్గానూ 'అడ్డమైనోళ్ళూ ఆవుని పెంచీ వోళ్ళే!' – అని మంటగానూ వుండేది.... ఇప్పుడు, దాన్ని చూస్తే, తల్లిపోయిన పిల్లని చూసినట్టూ, తండ్రి చచ్చిపోయిన యింట్లో వయసు చాలని పెద్దకొడుకు లాగానూ కనిపిస్తోంది.

....అదిగో, బీడుకి ఆకొసాని ఉంది. గడ్డికి ఆ పెట్టిన మద్ది వెంకయ్యగారి పొలం గట్టు. మంద అంతా బీడుని మేస్తూవుంటే, సుబ్బాయమ్మగారి గంగిగోవు వెళ్ళి మోకాల్లోతు గడ్డితో, ఉక్కిరి బిక్కిరి ఆదరా బాదరాగా గడ్డి కొరుకుతోంది. దానిది తెల్లటి ఒళ్ళు, నల్లటి కళ్ళు. జోరీగ కరిస్తే జొట జొట రక్తం కారేలా (చియ్యబట్టి) ఉందా ఆవు. అతి సాధువులాగా మహా సాధువులాగానూ కనిపించేది. ఇప్పుడు దాని కళ్ళు గుర్తుకొస్తే, అవి దొంగ కళ్ళనీ, వాటికి తన పచ్చేగాని పొరుగు పచ్చ పట్టదనీ రూఢిగా అర్థమవుతోంది.

.....పాఁవుల రాఁవులయ్య ఆవుల్ని పెంచడు – ఉదయం చూసేడు కాదా! వాడి యింటి ముందు చిన్న దూడ పెయ్యయినా లేదు. ఒకవేళ పెంచితే ఆ ఆవు కూడా – "ఆడిలాగే పొట్టిగా గిడసగా ఆవు కళ్ళలా మెరిసే పాము కళ్ళెట్టుకోని, పెద్దింటి కన్నయ్యగారి టొంప గొడ్డుకి ఇంకో తోడి దొంగౌతుంది."

...అలాగే, మోతుబరి సోమనాథంగారి ఎత్తుపడ్డా; చిట్టి వీరయ్యగారి పొట్టావు, డబ్బాల్నా గన్న గారి కురస తోకా, సన్యాసమ్మగారి బారుకొమ్ములూ దేన్ని చూసినా, నిన్న నిన్నటివరకూ ఒకలాగా, యివేళ ఇంకోలాగా కనపడుతున్నాయి.

తన కేఁవౌతుందో గురవడికి తెలియడం లేదు.

నోరులేని మూగజీవాల గురించి ఇలా ఆలోచించడం పాపమే కావచ్చు. కాని – ఆ పాపపు ఆలోచనలూ వూహలూ అతను కోరి తెచ్చుకున్నవి కావు, ఇతరులు అతని తలలోకి ఎక్కించినవీ కావు.

జీవితం, మనిషిలో మార్పు తెస్తుంది. అందుకు అనుభవం కారణమవుతుంది. ★

*(యువ: దీపావళి 1970)*